# శతావతారాలు



ముక్కామల నాగభూషణం

# విషయాను క్రమణిక


| | |
|---|---|
| శతావతారాలు | 5 |
| రామాయణం - మహాభారతం | 8 |
| మానవ వికాస పరిణామక్రమం | 20 |
| కథల ఆధారంతో కావ్యాలు రూపొందాయి | 60 |
| వాల్మీకి రామాయణం | 71 |
| మహాభారతం | 81 |
| జంతుబలి వ్యతిరేకత | 106 |

# శతావతారాలు

ఆస్తికుల నెవరినడిగినా దేవుడొక్కడే నంటారు. పలువురున్నారని ఎవరూ చెప్పరు.

భగవంతుడు నామ, రూప రహితుడు, అవాఙ్మానస గోచరుడు, ఆది మధ్యాంత రహితుడని మతగురువులు చెపుతుంటారు. కాని, ఇతరుల మతంకంటే మా మతం గొప్పది. వారి దేవుని కంటే, మా దేవుడు గొప్పవాడని ఘనంగా చెప్పుకుంటారు.

"హిందువులు అనేక దేవుళ్ళను, దేవతలను పూజిస్తారు. మేం ఒకే దేవుడిని ప్రార్థిస్తాం" అంటారు క్రైస్తవులు. అలాగే మహమ్మదీయులూ అంటారు. ఆ మాట నిజం కాదంటారు హిందువులు.

"మేం పూజిస్తున్న భగవంతుడొక్కడే. ఆయన సర్వాంతర్యామి. విశ్వమంతా భగవంతుని స్వరూపమే. ఆయనకొక పేరు లేదు. రూపం లేదు. కాబట్టి ఏ పేరుతో ప్రార్థించినా, ఏ రూపంలో పూజించినా, ఒకటే గనుక, రకరకాల రూపాలలో, అనేక పేర్లతో భగవంతుని పూజిస్తున్నవారు మా మతంలో వున్నారు. ఇదొక విశాలమైన దృష్టితో సాధించిన సమన్వయం. 'ఇతర మతాలలో' ఈ విశాలదృష్టి, సమన్వయం లేవు" అంటారు హిందువులు.

భగవంతుడున్నాడని నాస్తికులొప్పుకోరు. ఈనాడే కాదు ఆస్తిక – నాస్తిక వాదాలు రెండూ ఋగ్వేదకాలం నుండీ వున్నాయి.

ఆస్తిక – నాస్తికుల మధ్య గతంలో అనేక చర్చలు, ఘర్షణలు జరిగాయి. "నాస్తికులు పాషండులు, మూర్ఖులు, నీతి నియమాలు లేని వారు" అని ఆస్తికులు తిట్టిపోస్తే, "ఆస్తికులు బడుగులు, సోమరిపోతులు, పరాన్నభుక్కులు. మోసగాళ్ళు" అని నాస్తికులు తిట్టిపోశారు.

అధర్మాన్ని పెంచి, పాపులతో నరకాన్ని నింపి, స్వర్గంలో ఒత్తిడి తగ్గించేందుకు గౌతమ బుద్ధుడు అవతరించాడని వైదికులు ప్రచారం చేశారు.

# రామాయణం - మహాభారతం

ఇతిహాసము, సంహిత, ఆఖ్యానమను పేర్లు రెంటికీ వున్నాయి. జయమను పేరు రామాయణమునకు లేదు. కాని, అష్టాదశ పురాణాలతో పాటు, రామాయణ, మహాభారత ములు కూడా జయసంజ్ఞ కలవేనని భవిష్యత్పురాణంలో రాశారు.

ఈ ఇతిహాసాలలో ఏది ముందు? ఏది వెనుక? అసలివి ఎప్పటివి? చారిత్రకాధారా లేమైనా వున్నాయా? లేవా? అనే విషయాలపై అనేకులనేక విధాలుగా చెపుతున్నారు.

భారతం కంటే రామాయణమే ముందుదని జాకోబి అభిప్రాయపడ్డారు. ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు రచించిన "సంస్కృత వాఙ్మయ చరిత్ర – లౌకిక వాఙ్మయం" అన్న గ్రంథంలో చూపిన ఆధారాలు చూద్దాం :

"రామాయణం ఆది కావ్యం. ఆర్షము వేదసమ్మతము. ఏకనాయకమగు రామాయణం పరిక్రియ యనెడి ఇతిహాసం. బహునాయకమైన భారతం పురాకల్పమనెడి ఇతిహాసం."

"రామాయణ కథ త్రేతాయుగంలోనిది. భారతకథ ద్వాపరాంతం నాటిది. అందలి కథానాయకుడు రాముడు. ఇందలి కథా ప్రవర్తకుడు కృష్ణుడు."

"సప్తమహర్షులలోని అత్రి, భరద్వాజ, వసిష్ట, విశ్వామిత్రులకు రామకథతో సంబంధమున్నది. భారతంలోని ప్రధాన కథతో ఆ మహర్షులకు సంబంధం లేదు."

"ఏకనాయక కావ్యము ముందు పుట్టుటయు, బహునాయక కావ్యము తరువాతి దగుటయు సహజమే. మొదటి కథ సరళంగా నుండడం. తరువాతి కథ తికమకలుగా నుండడం గూడ సహజమే."

"శ్రీరామునకు సనాతన ధర్మనిష్ట యెక్కువ. రాజ నీతిజ్ఞత తక్కువ. ధర్మరాజు ధర్మవర్తనుడయ్యు, రాజనీతి పారంగతుడై కార్యం నడిపినవాడు."

"సీతకు లోకజ్ఞానము లేదు, ద్రౌపదికున్నది."

"భరత, లక్ష్మణులు రాముని మాట జవదాటలేదు. భీమార్జును లొక్కొక్కప్పుడు ధర్మరాజును నిందించారు".

"సంగ్రామ నియమములు, వ్యూహములు రామాయణ కాలమున కంతగా లేవు. అవి కురుక్షేత్ర యుద్ధంనాటి కున్నాయి."

"రామాయణ కాలంనాడు దక్షిణ భారతదేశం గాఢారణ్యమయం – భారత కాలమునాటికి, కొంచెము నాగరికత గాంచిన జనపదము లేర్పడినాయి."

"భారతమున రామోపాఖ్యానము కనబడుతున్నదిగాని, రామాయణమందెక్కడా, భారత ప్రధానకథలోని పాత్రలేవీ కనిపించడం లేదు."

ఈ వాదనను వ్యతిరేకిస్తూ, రామాయణం కంటే భారతమే ముందుగా రూపొందిందనే వారు, ఈ క్రింది ఆధారాలను చూపిస్తున్నారు :

"ఆర్యులు పంజాబ్ ప్రాంతాలలో నుండగా కురుక్షేత్ర యుద్ధం జరిగింది. ఆ తరువాతనే ఆర్యులు అయోధ్య, మిథిలా నగరాల వరకు విస్తరించ గలిగారు. కాబట్టి, రామాయణగాథ కంటే భారతమే ముందుదని చెప్పవచ్చు."

"హస్తినాపుర త్రవ్వకాలలో పురాతన శిథిలాలు, సాక్ష్యాధారాలు కొన్ని దొరికాయి. అయోధ్యలో ఇంతవరకలాంటివి దొరకలేదు."

"భారతం పంచమ వేదం. రామాయణం వేదసమ్మతం మాత్రమే."

"భారతం తరువాతనే రామాయణం రూపొందింది. కనుకనే భారతంలో కంటే, రామాయణంలో కావ్యభాషా లక్షణాలధికంగా వున్నాయి."

"మాతృస్వామిక దశనాటి లక్షణాలు భారతంలో వున్నాయి. ద్రౌపదికి ఐదుగురు భర్తలుం డడానికి కారణమదే. సమాజం పితృస్వామిక దశలో ప్రవేశించిన పిమ్మటిదే రామాయణం."

రామాయణ రచన కంటె, భారత రచన ముందుగా జరిగిందని వాదించే వారిలో వాష్‌బర్న్ హాప్కిన్స్ ముఖ్యుడు.

"భారతంలోని పాత్రలు పచ్చిగా వున్నందున, వాటికి భిన్నమైన పాత్రలను తీసుకొని, వాల్మీకి రామాయణం వ్రాశాడు" అని శ్రీ యస్.ఎ. డాంగే అభిప్రాయపడ్డారు.

"భారతం తరువాతనే రామాయణం రూపొందింది. కనుకనే రామాయణ కథ లంకవరకూ విస్తరించింది. అలాగాక, వ్యావసాయక దశ ప్రారంభమైన సమయంలోనే రామాయణం రూపొంది వుంటే, అది భారతంకంటే ముందుదే అయివుంటుంది. ఆ

# మానవ వికాస పరిణామక్రమం

"సుమారు రెండువందల కోట్ల సంవత్సరాల క్రితం సముద్ర జలాలలో జీవరాశి ఆవిర్భవించింది. సాగర జీవరాసుల నుండి, భూమిపై నివసించే పశుపక్షి ఫణ్యాదులు ప్రభవించాయి. అలా ప్రభవించిన వానరజాతుల్లో కొన్నిటి రూపాలు – పరిణామ క్రమంలో మారి మారి మానవ రూపాలు ధరించాయి" అని పరిణామ సిద్ధాంత వేత్తలు నిర్ణయించారు. అలా ప్రతిఫలించినవారే ఆదిమానవులు – వారే మన పూర్వులు.

అలా ప్రారంభమైన మానవజాతి చరిత్రనొక క్రమపద్ధతిలో రచించడానికి, అద్భుత మేధాశక్తి సంపన్నుడైన మోర్గన్ చాలా శ్రమించాడు. 1875 వరకూ, వివిధ ఖండాలలో నివసిస్తున్న తెగల ఆచార వ్యవహారాలను సంప్రదాయాలను, విశ్వాసాలను నిశితంగా పరిశీలించారు. ఆటవిక యుగం నుండి అనాగరిక యుగం ద్వారా నాగరికయుగంలో అడుగిడిన మానవుడు పొందగలిగిన క్రమవికాసంపై అనేక పరిశోధనలు చేశాడు. ఆ అనుభవంతో "ప్రాచీన సమాజం" అనే గ్రంథాన్ని రచించాడు. నేటి పితృస్వామిక సమాజానికి ముందు మాతృస్వామిక సమాజ ముండేదని నిరూపించాడు.

జీవశాస్త్రానికి పరిణామ సిద్ధాంతం ఎంత ముఖ్యమైనదో, అర్థశాస్త్రానికి అదనపు విలువ సిద్ధాంతం ఎంత ముఖ్యమో, పితృస్వామిక సమాజానికి ముందు మాతృస్వామిక సమాజముండేదని మోర్గన్ కనుగొన్న అంశం కూడా అంత ముఖ్యమైనదే. కనుకనే కుటుంబ వ్యవస్థ యొక్క పరిణామక్రమంలో వచ్చిన ప్రధాన దశలను ఆయన సవివరంగా చిత్రించగలిగాడు.

## ప్రధాన దశలు

సమశీతోష్ణ మండలాలలో పుట్టి పెరిగిన మానవుడు, తన రక్షణ కొరకు అనేకవేల సంవత్సరాలపాటు చెట్లమీదను, గుహలలోను నివసించాడు. కాయలు, పండ్లు, ఆకులు,

దుంపలు తిని బ్రతికాడు. క్రమంగా శబ్దోచ్ఛారణలో విస్పష్టతను సాధించి విజయమందాడు. ఇదే మానవజాతి యొక్క శైశవదశ. ఈ దశనే ఆటవిక యుగంలోని ప్రథమదశగా మోర్గన్ పేర్కొన్నాడు.

ఈ దశలో మానవులకు దేవుళ్ళు లేరు. దయ్యాలు లేవు – గుడ్డలేదు. గుడిసెలేదు. కనీసం రాతిపనిముట్లయినా లేవు. ఆత్మరక్షణ, ఆహారసేకరణ దప్ప మరో ధ్యాసలేదు కనుకనే ఆదిమానవులు తమను తాము రక్షించుకునేందుకు ఆహారాన్ని సంపాదించు కునేందుకు గుంపులు గుంపులుగా కలిసి జీవించారు.

అటు తరువాత మానవుల మేధాశక్తి కాస్త పెరిగింది. పెనుగాడ్పుల వల్ల చెట్ల కొమ్మలు రుద్దుకోవడం, వాటి ఒరిపిడికి నిప్పు పుట్టడం, అడవులు తగలబడడం చూచారు. మంటల్లో చిక్కి, కాలిపోయిన జంతువుల మాంసాన్ని, పిట్టల మాంసాన్ని రుచి చూశారు. 'చాలా బాగుంది' అనుకున్నారు. ఒరిపిడి ద్వారా నిప్పు పుట్టించారు. పక్షులను, చేపలను కాల్చుకు తిన్నారు. పిండిపదార్థంగల దుంపలను కుమ్ములో ఉడకబెట్టి తిన్నారు. జంతువులను వేటాడేందుకు, వాటిని కోసుకునేందుకు వాడిమొనగల శిలలను తయారు చేసుకున్నారు. ఒక ప్రాంతంలో తిండి దొరకనప్పుడు మరో ప్రాంతానికి వెళ్ళారు. అలా నదులవెంట, సముద్రతీరాల వెంటబడిపోతూ సుదూర ప్రాంతాలకు విస్తరించారు. మోర్గన్ నిర్ణయం ప్రకారం ఈ దశ ఆటవికయుగంలోని ద్వితీయదశ.

ఈ దశలో కూడా మానవులకు వావి వరుసలు లేవు. అన్నా – చెల్లెలు, తల్లీ – కొడుకు, తండ్రీ – కూతురు అనే విచక్షణ లేదు. బెహ్రింగ్ జలసంధి ప్రాంతంలో నివసించే 'కివయటు' ల్లోను, అలాస్కా సమీపంలోని 'కాదియకు' ల్లోను వావివరుసలు లేవని 1875లో జాన్‌క్రాఫ్ రాశాడు. ఛిప్పేవా ఇండియన్లలోను, ఛిలీలోని 'కాకూస్' జాతిలోను, కరిబియన్ల లోను, కరెన్ తెగలలోను తల్లీ–కొడుకు, తండ్రీ–కూతురు, అన్నా–చెల్లెలు అనే విచక్షణలేదని 1888లో లెతోర్నే అను పేరుగల ఆదిమజాతి చిత్రకారుడు తెలుసుకున్నాడు. ఒకప్పుడిలా అన్నిచోట్లా వుండేది. కనుకనే భారతంలో అన్నా–చెల్లెల సంబంధం, పాత నిబంధనల గ్రంథంలో తండ్రీ–కూతుళ్ళ సంబంధం గల కథలున్నాయి.

ఆ స్థితిలో పిల్లలకు తండ్రి ఎవరో తెలుసుకునే అవకాశం లేదు. తల్లి మాత్రమే తెలుస్తుంది. కాబట్టి ఒక తల్లిబిడ్డలు, ఆమె కుమార్తెల బిడ్డలు, మనుమరాళ్ళ బిడ్డలు కలిసి జీవించారు. తల్లి మాట విన్నారు.

అలా నాలుగైదు తరాలు కలిసి జీవించేటప్పటికి గుంపు పెరిగేది. గుంపు మరీ పెద్దదైనప్పుడు రెండుగా చీలిపోయేవారు. చీలిపోయిన గుంపుకు మరో ముసలమ్మ

# కథల ఆధారంతో కావ్యాలు రూపొందాయి

**ఈ**నాడేదో ఒక కథను ఎంచుకుని సినిమా తీస్తున్నారు. ఇలాగే ఏదో ఒక కథమీద ఆధారపడి గతంలో కావ్యాలు సృష్టించారు. భాస, కాళిదాసాది మహాకవుల రచనల్లో చాలావరకు అలా రూపొందినవే. సమాజంలోని గుణదోషాలను, ప్రజల కోరికలను ప్రతిబింబించే కథల కీనాడు కొరత లేదు. రకరకాల కథలను పత్రికలు ప్రచురిస్తున్నాయి. వాటిని ప్రజలు చదువుతున్నారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతున్న వాటిని వింటు న్నారు. సినిమాలు, నాటకాలు విరగబడి చూస్తున్నారు. అయినా బుర్రకథలు, హరికథలు మున్నగువాటికి ప్రాముఖ్యత తగ్గలేదు. కాగా, పత్రికలు, సినిమాలు, ప్రసారాలు లేని రోజుల్లో, అసలు అక్షరాలనే కనిపెట్టనికాలంలో, కథలకెంత విలువ వుండేదో ఎవరైనా వాటిని చెప్పుతుంటే వినేందుకు ప్రజలెలా చెవికోసుకునేవారో మనం ఊహించవచ్చు.

పైగా ఆనాటి కథల్లో రామకథకొక ప్రత్యేక స్థానముండేది. ఆర్యులు పశుపోషణ దశలో వున్నప్పుడు పుట్టి, కాలానుగుణంగా పెరిగిన రామకథ ప్రజలనుబాగా ఆకర్షించ డానికి కారణముంది. "అన్నదమ్ములు కలిసివుంటే కలదు సుఖం. లేకపోతే బానిసత్వం తప్పదు" అని చాటిచెప్పేందుకు రామకథ చక్కగా ఉపయోగపడింది.

కాగా వాల్మీకి మహర్షి తన కావ్యవస్తువుగా రామకథను ఎంచుకున్నాడు. వేదాలలో అచ్చటచ్చట కనిపించే 'అనుష్టుప్' ఛందస్సుకు మెరుగులు దిద్ది, సొంపులు గూర్చి రామాయణ మహా కావ్యాన్ని సృష్టించాడు. దాన్ని స్వయంగా గానం చేయడమే గాక, వీరగాథలు పాడేవారికి కూడా నేర్పాడు. లేకపోతే, ఈ మహాకావ్యం మనకు లభించేది కాదు. ఎందువల్లనంటే....

కావ్యాన్ని అక్షరబద్ధం చేయడానికి అనగా ఏదో ఒక పత్రం మీద రాసి వుంచడానికి తగిన లిపిలేని రోజులవి. కాగా, శ్లోకాలనన్నింటినీ కంఠస్థం చేయకతప్పదు. ఒకటిగాదు, పదిగాదు, వేలకొలది శ్లోకాలను, ఒకదాని వెంట ఒకటిగా కంఠస్థం చేస్తూ, మరొక

శ్లోకాన్ని రచిస్తూ కావ్యాన్ని సృష్టించవలసిన కాలమది. కనుకనే వాల్మీకి మహర్షి తన కావ్యాన్ని గానం చేయడమేగాక తన శిష్యులకు కూడా నేర్పాడు.

ఈనాడు హరికథలు చెపుతున్న వారిని హరిదాసులని పిలుస్తున్నట్లుగానే ఆనాడు వీరగాథలు పాడేవారిని "కుశీలవులు" అని పిలిచేవారు. వాల్మీకి మహర్షి కూడా రామాయణ కావ్యాన్ని గానం చేసినందున, ఆయనకు "కుశీలవుడు" అని పేరొచ్చింది.

వాల్మీకి మహర్షి రామాయణ మహాకావ్యాన్ని గానం చేస్తే – ఉగ్రశ్రువ, వైశంపాయన, సంజయులు భారత గాథలను వినిపించారు. ఇలాంటి కథలు, గాథలు ఇతర దేశాల పురాణాల్లో కూడా వున్నాయి. మన రామాయణ మహాభారత రచనలకు మూలమైన కథల లాంటివి పాత నిబంధన గ్రంథంలో వున్నాయి.

'రామ' అనే పేరు గల వారు యూరోప్ ఆసియాల్లోని ఆర్యులలోనే గాక, సెమిటిక్, లాటిన్ భాషలు మాట్లాడే వారిలో కూడా వుండేవారు. రామాస్ అనే పేరుగల రాజులు ముగ్గురు ఈజిప్టులో రాజ్యమేలారు. యూదుల గ్రామాలలో కొన్నిటికి 'రామా' అనే పేర్లున్నాయి. యూదా వంశంలో రాము, ఆ రాము, యెహో రాము అను పేర్లు గలవారున్నారు. అబ్రహామ్ అసలు పేరు అబ్రాము. ఇజ్రాయేల్‌రాజు బయెషా 'రామా' అనే పట్టణాన్ని కట్టించాడు. నేటి డమాస్కస్ పట్టణ ప్రాంతానికొకప్పుడు 'ఆరామ దేశం' అనే పేరుండేది (ఓల్డు టెస్టుమెంటు)

రామ్‌లోవ్, కుశ్లోవ్ లాంటి పేర్లుగలవారు ఈనాడు కూడా సోవియట్ యూనియన్లో వున్నారు. పెరూ దేశంలోని "ఇంకా" తెగవారు, రామసీత్వా అనే పండగ చేసుకుంటున్నారు. స్త్రీలు చీరలు ధరిస్తున్నారు.

కాగా, ఈ 'ఇంకా' తెగవారికీ, ఆర్యులకూ ఏదైనా సంబంధముందా అనే విషయాన్ని తేల్చడానికి కొన్ని పరిశోధనలు సాగాయి. చివరికొక శిలాఫలకం ఆధారంతో, డా॥ జూల్సు పిక్కాస్, డా॥ సైరన్ గార్డనులు పూర్తి వివరాలను తెలుసుకోగలిగారు. వాటిని లైఫ్ మాగజైన్ ప్రకటించింది.

క్రీస్తు పూర్వం కొందరు పోనీషియన్లు, అకాబా సింధు శాఖనుండి పది ఓడల మీద బయలుదేరి, కొంతకాలం పాటు సముద్రయానం చేసినట్లున్నూ, దారిలో ఏడు ఓడలు తుపానులో చిక్కి మునిగిపోగా, మూడు ఓడలు కొట్టుకుపోయి బ్రెజిల్ తీరం చేరగా, వాటిలోని వారు బ్రతికి బయటపడినట్లున్నూ ఒక పెద్ద శిలాఫలకం మీద చెక్కబడి వుందట. అలా బ్రెజిల్ తీరం చేరినవారే చివరకు పెరూ దేశంలో స్థిరపడ్డారని పరిశోధకులు నిర్ణయించారు.

# వాల్మీకి రామాయణం

"ఇక్ష్వాకూణా మిదం తేషాం రాజ్ఞాం వంశేమహాత్మనాం.
మహదుత్పన్న మాఖ్యానం రామాయణ మితిశ్రుతమ్"

"ఈ రామాయణ మహాఖ్యాన మిక్ష్వాకు రాజవంశ మందుత్పన్నమైనదిగా వినవచ్చు చున్నది" అని వాల్మీకి మహర్షి స్వయంగా చెప్పినమాట లిచట గమనార్హం. తాను విన్న రామకథనొక మహాకావ్యంగా రూపొందించాడనుట స్పష్టం. అయినా, అవసరం కొద్దీ కథలల్లడంలో సిద్ధహస్తులైన పండితు లూరుకుంటారా? శ్రీరాముడు జన్మించినది మొదలు, చివరి వరకూ జరిగిన ఘటనలన్నింటినీ వాల్మీకి మహర్షి స్వయంగా చూచాడన్నారు. రామాయణం రచించవలసిందిగా వాల్మీకిని బ్రహ్మదేవుడు ఆదేశించాడన్నారు. రాముడు భగవంతుని అవతారమని నమ్మించేందుకు అనేకం రాసి వాల్మీకి రామాయణంలో చేర్చారు. అందువల్ల ఆ మహాకావ్యం యొక్క ఔన్నత్యం తగ్గినా లెక్క చేయకుండా, కావ్యాన్ని విపరీతంగా పెంచివేశారు.

అంతేగాక రామకథను క్లుప్తీకరించి భారతంలో చేర్చారు. భాగవతంలోను చేర్చారు. భాగవతంలోని ఇక్ష్వాకు రాజవంశాన్ని పరిశీలిస్తే, నమ్మశక్యంగాని కల్పనలనేకం కనిపిస్తాయి.

"ఒకనాడు మనువు తుమ్మితే ఆయన ముక్కులోనుండి ఇక్ష్వాకుడు ఊడిపడ్డాడు. అలా పుట్టిన ఇక్ష్వాకునకు నూరుగురు కొడుకులు పుట్టారు. వారిలో పెద్దకొడుకు పేరు వికుక్షి. రెండో కొడుకు పేరు నిమి".

"వికుక్షి వంశంలో పదిహేనుతరాలు గడిచిన పిమ్మట యువనాశ్వుడు పుట్టాడు. అతనికి నూరుగురు భార్యలున్నారు. అయినా సంతానంలేదు. కాబట్టి, సంతానం కొరకు యువనాశ్వునితో మునులు యాగం చేయించారు. యాగం ముగిసిన పిమ్మట, పవిత్ర జలాన్ని మంత్రించి ఒక కలశంలో పోసి, రాజుగారి పెద్దభార్య కిచ్చేందుకు దాచిపెట్టారు.

కాని, అర్ధరాత్రి సమయంలో అమితమైన దాహం తీర్చుకునేందుకు యువనాశ్వుడా మంత్రజలాన్ని తాగాడు కనుక ఆయన కడుపు చీల్చుకుని మాంధాత పుట్టాడు.”

“మాంధాత నుండి ఇరవై ఆరు తరాలు గడిచిన పిమ్మట సుదాసుడు పుట్టాడు. ఆయనకు సంతానం లేదు. కాబట్టి, ఆయన భార్య మదయంతి వశిష్టునితో శయనించి గర్భవతియై ఏడేళ్ళు గడిచినా ప్రసవించలేక బాధపడుతుంటే వసిష్టుడొక వాడియైన రాతి పనిముట్టుతో ఆమె గర్భాన్ని చీల్చి బిడ్డను బైటికి తీశాడు” అలా పుట్టాడట అశ్మకుడు.

“అశ్మకునకు మూలకుడు పుట్టాడు. ఆ సమయంలో క్షత్రియుల నందరినీ పరశు రాముడు చంపుతోంటే, ఆ బిడ్డను ఆడవాళ్ళు దాచిపెట్టారు. పరశురాముని చేతిలో క్షత్రియులందరూ చచ్చినప్పటికీ, ఆ బిడ్డ మాత్రం బ్రతికి, నిర్మూలమైన రవి వంశానికి మూలమ య్యాడు. కాబట్టి ఆయనకు మూలకుడు అనే పేరు కలిగింది. మూలకునకు ఎనిమిది తరాల తరువాత శ్రీరాముడు పుట్టాడు”.

“ఇక్ష్వాకుని రెండవ కొడుకైన నిమి, వసిష్టుడు దగ్గర లేనప్పుడు యజ్ఞం చేశాడు. అందువల్ల వసిష్టునకు కోపమొచ్చి నిమిని శపించగా, నిమి వశిష్టుని శపించాడు. కాబట్టి ఇద్దరూ మరణించారు. అయినా వసిష్టుడు తిరిగి ఊర్వశి కడుపున మిత్రావరుణులకు పుట్టాడు. నిమిని బ్రతికించేందుకు దేవతలు పూనుకున్నప్పటికీ, తిరిగి బ్రతికేందుకు నిమి ఇష్టపడలేదట.

“రాజుగారు బ్రతకలేదు. పైగా ఆయనకు బిడ్డలు లేరు. కాబట్టి, రాజ్యం అరాజకమై పోతుందని భయపడిన మునులు నిమి శవాన్ని మర్దించగా జనకుడు పుట్టాడు. ఈ జనకునకు వైదేహుడు. మిధులుడు అనుపేర్లు కూడా వున్నాయి. కనుకనే ఈయన నిర్మించిన నగరానికి మిథిలా నగరమనే పేరొచ్చిందట.

“మిధులుని వంశంలో ఇరవై తరాలు గడిచిన పిమ్మట సీరధ్వజుడు పుట్టాడు. ఆయన యజ్ఞం చేసేందుకు భూమిని దున్నుతోంటే, నాగలి కర్రు కొననుండి సీత పుట్టింది” అని పెద్ద కథ చెప్పారు. అయితే సీత సీరధ్వజుని కూతురా? లేక జనకుని కూతురా? ఏమో ఎవరికి తెలుసు. ఈ కల్పిత కథలకు తలా తోకా వుంటేగా? అన్నీ అభూతకల్పనలే. అన్నీ అసంభవ జన్మలే.

సరే. ఈ జన్మల మాట ఎలా వున్నా, సీతారాములిద్దరూ ఇక్ష్వాకు వంశంలోనే పుట్టినట్లుగా తేలిపోతోంది గాబట్టి వారిద్దరూ సోదరీ సోదరులేనని కొందరు కథలు రాశారు. పైగా, ఇక్ష్వాకుని పెద్దకొడుకైన వికుక్షి వంశంలో యాభై అయిదు తరాలు గడిచిన పిమ్మట రాముడు జన్మించగా, ఇక్ష్వాకుని రెండోకొడుకైన నిమి వంశంలో ఇరవై రెండు తరాలు

# మహాభారతం

**రా**మాయణ గాథకు భిన్నంగా వుంది భారత గాథ. రామాయణానికి మూలం త్యాగం. భారతానికి మూలం స్వార్థం. రాజ్యకాంక్ష. రామకథ రక్త సంబంధానికి విలువ నిచ్చింది. సంజయుని యుద్ధగాథ దాన్ని త్రోసి పుచ్చింది. పశుగణాభివృద్ధి జరిగి, వ్యవసాయం ప్రారంభమైన దశలో వెలువడింది రామకథ. వ్యవసాయాభివృద్ధి జరిగి పట్టణ నాగరికత ప్రారంభమైన దశలో వెలువడింది భారత యుద్ధగాథ. అందువల్ల వీటి దృక్పథాలు, ప్రయోజనాలు వేరుగా వున్నాయి.

అసుర, రాక్షసాది తెగలతో పోరాడుతున్న సమయంలో ఆర్యుల మధ్య మంచి ఐకమత్యముంది. రక్తసంబంధానికి గణనీయమైన ప్రాముఖ్యతుంది. ఒక గోత్రంలోని వారంతా తమ గోవులను ఒకేచోట మేపుకునేవారు. పోరాడవలసివస్తే, గోత్రాల వారీగా నిలబడి, ఒక గోత్రం వారిని మరో గోత్రం వారు ఆదుకుంటూ పోరాడేవారు. ఈ ఐక్యత ఇక్కడే కాదు. పశువుల మందలను పెంచుకున్న దశలో అన్ని దేశాలలో వుండేది. గ్రీసులో రక్త సంబంధానికి గల ప్రాముఖ్యతను మహాకవి హోమర్ వివరించాడు.

"సైన్యాలను తెగలవారీగా, గణాలవారీగా విభజించు అలా చేస్తే గణంలోని వారందరూ కలిసికట్టుగా పోరాడతారు. తెగలోని ఒక భ్రాతృగణం, మరో గణానికి వత్తాసు నిస్తుంది" అని ట్రాజన్ యుద్ధంలో అగమెమ్నానుకు నెస్టర్ సలహా ఇచ్చినట్లుగా హోమర్ కావ్యంలో వుంది.

ఇంత ప్రాముఖ్యతగల రక్త సంబంధాన్ని రాజ్యకాంక్ష త్రోసిపుచ్చింది. అర్జునుడు గణధర్మం (రక్త సంబంధం) మాట ఎత్తితే, కృష్ణుడు క్షాత్రధర్మాన్ని బోధించాడట. గురువూ లేదు, తండ్రీ లేదు అడ్డం వచ్చిన వాళ్ళనందరినీ నరికేయమన్నాడట. విజయమో, వీరస్వర్గమో. అంతేకాని మరోమాట ఎత్తవద్దన్నాడట. రాజ్యం వీరభోజ్యమని భావించడమే దీనిక్కారణం. ఇదే భారతగాథకు మూలం.

"కాలం గడిచినకొద్దీ రక్తసంబంధం కరుడుగట్టి పోతుంది. కాని, సమాజంలో ప్రధానమైన మార్పులు సంభవించినపుడు మాత్రం అది కాస్త కరుగుతుంది" అన్నాడు మార్క్స్.

అవును అలాగే జరిగింది. ఆటవిక దశలోని మానవులు గణాలుగా, తెగలుగా కలిసి జీవించకపోతే మనుగడ సాధ్యమయ్యేదిగాదు. కనుకనే రక్తసంబంధం ప్రాముఖ్యత వహించింది. పశువుల మందలను పెంచిన దశలో కూడా ఆ పరిస్థితి కొనసాగింది. కాని, వ్యావసాయక దశలో అవసర వస్తువుల ఉత్పత్తి పెరగడం వల్ల సంపద హెచ్చింది. కాబట్టి, సమాజంలో గణనీయమైన మార్పు సంభవించింది. రక్తసంబంధానికి గల ప్రాముఖ్యత తగ్గింది. ఈ మార్పు ఎలా కలిగిందో వివరిస్తూ ఎంగెల్సు ఇలా రాశాడు.

"ముడి ఇనుమును కరిగించి పోతపోయడం నేర్చుకున్ననాటి నుండీ అనాగరిక యుగపు పైదశ ఆరంభమైంది. మానవ సమాజ పరిణామంలో అంతవరకూ గడిచిపోయిన దశల్లో జరిగిన ఉత్పత్తికన్నా, అనాగరిక యుగపు పైదశలో జరిగిన ఉత్పత్తి చాలా హెచ్చు. వీరయుగం నాటి గ్రీకులు, రోమ్ నగర నిర్మాణానికి ముందునాటి ఇటాలియన్లు, టాసిటస్ కాలంనాటి జర్మనులు, వైకింగ్ కాలంనాటి నార్సిమన్ లాంటి వారంతా ఈ దశకు చెందినవారే."

"...... అన్నిటికన్నా ముఖ్యంగా ఇనుపకర్రు వేసిన నాగలి, పశువులచే లాగబడేది– మనకీదశలోనే కనబడుతుంది. దీనితో విస్తృతంగా వ్యవసాయం చేయడానికి వీలు చిక్కింది. ఆహారపదార్థాలు పుష్కలంగా లభించాయి. భూములు దున్నాలన్నా, పచ్చిక బీళ్ళు పెంచాలన్నా, పోడుగొట్టి, అడవులు నరికి బాగు చేయాలి. అందుకు ఇనుపగొడ్డలి, పలుగు, త్రవ్వుకోల ఉపయోగపడ్డాయి."

".....హోమర్ గేయాల్లో, ముఖ్యంగా ఇలియడ్‌లో మనకు అనాగరికపు యుగపు పై దశ మహోన్నత స్థితిలో వున్నట్లు గోచరిస్తుంది. ఆనాటికి ఇనుప పనిముట్లు బాగా వృద్ధి పొందాయి. కొలిమితిత్తులు, చేతిమరలు, కుమ్మరిసారెలను కనిపెట్టారు. నూనెతీయడం, సారా కాయడం నేర్చుకున్నారు. లోహ పరిశ్రమ ఒక కళగా వృద్ధి బొందుతోంది. బండి, రథము తయారయ్యాయి. చెక్కలతోను దూలాలతోను ఓడలను నిర్మించారు. సరిహద్దు దేశాలతోనే గాకుండా, సముద్రాంతర దేశాలతో కూడా వర్తకం ప్రారంభమైంది. గృహ నిర్మాణ విద్య ఒక కళగా మారుతోంది. బురుజులు, గోపురాలతో కోటలు నిర్మించసాగారు. హోమర్ కావ్యాలవంటి మహాకావ్యాలు, పురాణాలు వెలువడ్డాయి" అన్నాడు ఏంగెల్స్.

# జంతుబలి వ్యతిరేకత

**ఆ**ధిక్యత కొరకు బ్రాహ్మణ, క్షత్రియ, వర్ణాలవారు ఘర్షణ పడుతున్న సమయంలో కూడా యజ్ఞ యాగాదుల జోరు హెచ్చిందే గాని తగ్గలేదు. రాజులు యాగం చేస్తుంటే, రాజభటులు, ఉద్యోగులు పల్లెలమీదబడి, పశువులతో పాటు ధాన్యం, వెన్న, పప్పు, ఉప్పు కూడా గుంజుకుపోయేవారు. క్రతువుకు అవసరమైన వాటిని రాజుగారికిచ్చి, తక్కినవాటిని పంచుకునేవారు. రాజుగారి చేతిమీదుగా గోవులు, బంగారం బ్రాహ్మణులకు దక్కేవి.

ఇకనేం? వాన కురవకపోతే యజ్ఞం, పిల్లలు పుట్టకపోతే యజ్ఞం, సామంతుల సంపదను గుంజుకునేందుకు యాగం. చేసిన పాపం పోగొట్టు కునేందుకు యాగం. మోక్షం కొరకు యజ్ఞం. అన్నీ యజ్ఞాలే. అన్నీ యాగాలే. వీటికి అవసరమైన గోవులు, ధాన్యం, ధనం సమర్పించే పశుపాలకులు, రైతులు, వ్యాపారులు నరకయాతన అనుభవించే వారు. వ్యవసాయం, పశు సంపద క్షీణించాయి.

కాగా, సాత్వతులు (వాసుదేవ భక్తులు) జంతుబలిని వ్యతిరేకించారు. మహావీరుడు బుద్ధుడు యజ్ఞయాగాది క్రతువులను వ్యతిరేకిస్తూ జైన, బౌద్ధ ధర్మాలను ప్రతిపాదించారు. బౌద్ధ సన్యాసులు దీనజనోద్ధరణకు పూనుకున్నందువల్ల సామాన్య ప్రజలను బౌద్ధమతం బాగా ఆకర్షించింది. పశుపాలకులు రైతులు మాత్రమే గాక, కొందరు వైశ్యులు కూడా క్రతువులను వ్యతిరేకించారు. బౌద్ధమతాన్ని బలపరిచారు.

అశోకచక్రవర్తి బౌద్ధమతాన్ని స్వీకరించడంతో బౌద్ధం బాగా బలపడింది. ఆయనగారి ప్రోత్సహంతో ఆగ్నేయాసియాకు, శ్రీలంకకు విస్తరించింది. కాగా, వైదిక మత పెద్దలు దిక్కు తోచని స్థితిలో పడిపోయారు.

ఇలా బౌద్ధమతం బలపడుతున్న సమయంలో వాసుదేవ, నారాయణ, విష్ణుభక్తులు ఏకమయ్యారు. భాగవతులుగా పేరొందినవారు వీరే. వీరి ధర్మం, వైష్ణవ ధర్మం. వీరు కూడా జంతుబలిని వ్యతిరేకించడం వల్ల వీరి వైష్ణవ ధర్మం ప్రజలనాకర్షించింది. కాగా,

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Satavataralu**

* * *